జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
మంగళవారం 24 ఫిబ్రవరి 2026 పేజీలు : 14






2 లో..

## రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం అండ

## చిన్నారితో ముచ్చటించిన తేజస్ నందలాల్ పవర్



**కోదాడ టౌన్,ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):**

అధికారిక పర్యటనలో భాగంగా సోమవారం కోదాడకు వచ్చిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ సామాన్య ప్రజలతో కలిసిపోయారు. రాజేష్ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం తిరిగి వెళ్తుండగా, దారిలో తల్లి ఒడిలో ఉన్న చిన్నారిని చూసి చిరునవ్వుతో పలకరించారు. పాప పేరు అడిగి తెలుసుకున్న కలెక్టర్, ఆమెను అంగన్‌వాడీకి పంపిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కలెక్టర్ స్వయంగా ఆగి తమను పలకరించడంతో ఆ తల్లి ఆనందానికి అవధులు లేవు. అధికారుల ంటే కేవలం ఆదేశాలు ఇచ్చేవారే కాదు, ప్రజల బాగోగులు చూసేవారని ఆయన మరోసారి నిరూపించారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన

# నిర్మాణ పనులను పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్గొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.



2 లో..



## సంత్ సేవాలాల్ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలి

నీతి, నిజాయితీ, ధర్మం వంటి సత్యమార్గాలు బోధించిన సంత్ సేవాలాల్ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.

2 లో..

### ఇంజనీరింగ్ శాఖలు చేపట్టిన పనులను

# ప్రాధాన్యత క్రమంలో, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలి

**అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష**

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

8 లో..

వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన పనులను ప్రాధాన్యత క్రమంలో, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అంగన్వాడి కేంద్రాలు, మూత్రశాలలు, అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాల ప్రహరీ గోడలు, కాంపౌండ్ గోడలు, మూత్రశాలల నిర్మాణం వంటి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. చిన్నారులు మరియు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందేలా నాణ్యతతో పనులు చేయాలని సూచించారు.





# రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం అండ

### ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం అందజేసిన కలెక్టర్



**కోదాడ టౌన్,ఫిబ్రవరి 23 ( ప్రజా జ్యోతి):**

కోదాడ కర్ల రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో చేయూత అందిస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ హామీ ఇచ్చారు. రాజేష్ తల్లి లలితమ్మను కలెక్టర్ కోదాడలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించిన నియామక పత్రం కూడా సిద్ధమైందని, మరో రెండు మూడు రోజుల్లోనే లలితమ్మకు నియామక పత్రాన్ని కూడా అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల బెనిఫిట్స్ ను ఆ కుటుంబానికి వర్తింపజేసి, అన్ని విధాలా అండగా ఉంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఆర్డీఓ సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి, తహసిల్దార్ వాజీద్ అలీ,యాతాకుల రాజన్న మాదిగ,ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా కన్వీనర్, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆంజనేయులు, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు యలమర్తి రాము మాదిగ, ములకలపల్లి రవి మాదిగ, పిడమర్తి చిన్న వెంకట్రావు, లంజపల్లి శ్రీను, ఆకారపు కొండలు, కొండపల్లి సూర్యప్రకాష్, బొడ్డు కుటుంబరావు, సిరి పంగి లింగస్వామి, ఎమ్మార్పీఎస్ పట్టణ నాయకులు కర్ల శివ, కర్ల కమల్, తదితరులు పాల్గొన్నారుతదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**



నల్గొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను 15 రోజుల్లో పూర్తి



చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం అయన నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి జైలు సమీపంలో నిర్మాణంలో ఉన్న మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను తనిఖీ చేశారు. మొదటిసారిగా ఈ భవనాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవనం నిర్మిస్తున్న స్థలం, అంచనా వ్యయం, తదితర వివరాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. భవనాన్ని పూర్తి చేసేందుకు మరికొంత బడ్జెట్ అవసరం ఉందని డి ఎం హెచ్ ఓ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటివరకు నిర్వహిస్తున్న పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని పరికరాలను ఇక్కడ వినియోగించడం జరుగుతుందని, అయితే భవన నిర్మాణానికి మరికొంత బడ్జెట్ అవసరం ఉన్న విషయాన్ని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సైతం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 15 రోజుల్లో మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవనం మొత్తాన్ని పరిశీలించారు. డాక్టర్ గదులు, పేషంట్స్ వేచి ఉండే గది, ల్యాబ్, స్టోర్, వివిధ గదులు, వార్డులు, ర్యాంప్, టాయిలెట్ సౌకర్యం, అలాగే నీటి వసతి..... పరిసరాలు అన్నింటిని పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటిండెంట్ నేత నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

నీతి, నిజాయితీ, ధర్మం వంటి సత్యమార్గాలు బోధించిన సంత్ సేవాలాల్ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సంత్ సేవలాల్ మహరాజ్ 287 వ జయంతిని పురస్కరించుకొని సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ లంబాడా, గిరజన జాతిలోని మూఢనమ్మకాలను పారద్రోలి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో రూపొందించిన రాజ్యాంగం, హక్కులు, ప్రభుత్వ పథకాలను పేద, నిమ్న వర్గాలకు అందించేందుకు ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. ఎస్టీ, బంజారాలకు సమాజ స్థితిగతులను తెలియజేశారని, సంత్ సేవాలాల్ నీతి, న్యాయం, ధర్మాన్ని పాటించాలన్న వారి మార్గదర్శకాలను, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆధ్యాత్మిక గురువని, సేవ, ధర్మం సమ భావనలను బోధించారని, సత్సంగ్ ద్వారా సమాజాన్ని







మంచి మార్గంలో పయనించేందుకు కృషి చేశారని అన్నారు. సమావేశానికి ప్రవీణ్ నాయక్ అధ్యక్షత వహించి మాట్లాడగా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, లంబాడ హక్కుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సకృ నాయక్, ఎరుకల సంఘం అధ్యక్షులు నరసింహ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్, డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ, తహసిల్దార్ పరశురాం ,కార్పొరేటర్లు దీప్లా నాయక్, నాగార్జున, రవి నాయక్, ఇతర లంబాడా సంస్థల ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, మేయర్, డిప్యూటీ మేయర్, తదితరులు సంతు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# యూరియా ఆన్ లైన్ యాప్‌ను ఎత్తివేయాలి

## రైతులకు శ్రేయస్సుకోసం న్యాయపోరాటం చేస్తా

### – రైతుబంధు సమితి మాజీ జిల్లాఅధ్యక్షుడు చింతరెడ్డి

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 23,( ప్రజాజ్యోతి ):**

యూరియా ఆన్ లైన్ లో నమోదు ప్రక్రియను ఎత్తివేయాలని, రైతులకు సరిపడా యూరియా అందుబాటులోఉంచాలని, లేనిపక్షంలో రైతుల శ్రేయస్సుకోసం, ఒక రైతుగా న్యాయపోరాటం చేస్తానని మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రైతుబంధు సమితి నల్గొండ మాజీ జిల్లా అధ్యక్షుడు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానికంగా ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి యాసంగి సీజన్లో ప్రతి ఎకరాకు మూడు బస్తాల యూరియా తప్పనిసరి అని అన్నారు. తనకు 18.18 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని,యూరియా కోసం ఆన్ లైన్ లోయాప్ ద్వారా దరఖాస్తు చేయగా కేవలం 12 యూరియా బస్తాలే సరఫరా చేశారని, మిగిలిన యూరియా బస్తాలు నేటికీ అందలేదన్నారు. 15 రోజుల తదుపరి మరోసారి దరఖాస్తు చేసుకోవాలనివ్యవసాయ అధికారులు సలహా ఇచ్చారని, తద్వారా తీవ్రమైన పంట నష్టం జరగడంతోపాటు పంట దిగుబడితగ్గుతుందన్నారు. యూరియా నమోదు యాప్ దరఖాస్తు చేసే సమయంలో సెకండ్స్ లలో యాప్ తొలగి పోతుందన్నారు.సుమారు 50 శాతం మంది రైతులు స్మార్ట్ ఫోన్లు లేనివారు ఉన్నారని, అక్షరాస్యత లేని, సాంకేతిక పరిజ్ఞానం తెలియదని ఆయన అన్నారు. యాప్ ద్వారా యూరియా కొనుగోలు కంటే ట్రాన్స్ పోర్ట్ చార్జీల ధర ఎక్కువైతుందన్నారు. చిన్న రైతులకు, ఎన్నారై రైతుల భూములను కౌలు చేసే రైతులకు యాప్ ద్వారాయూరియా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. యూరియా బుక్ చేసుకుంటే ఓటిపి ఎన్నారైలకువెళుతుందని, ఆలోపే యూరియా స్టాక్ లేదని,యాప్,తొలగిపోతుందన్నారు. తరచుగా ఆన్ లైన్ లో సర్వర్ వైఫల్యాలు సాంకేతిక లోపాలుసంభవిస్తున్నాయన్నారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో రైతులు యూరియా బుకింగ్ కోసం ప్రయత్నించిన సమయంలో ఆన్ లైన్ బిజీగా ఉండి నమోదు చేసుకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. యూరియా యాప్ నుండి అసైన్డ్ భూములకు పూర్తి మినహాయింపు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాప్ లో అసైన్డ్ ల్యాండ్ ఆప్షన్ లేకపోవడం వల్ల అసైన్డ్ భూములు సాగు చేసుకునే రైతులు యూరియాకు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పంటలు పొట్ట దశ కంటే ముందే యూరియా అవసరం చాలా ఉందని, చాలామంది రైతులకు పొట్ట దశలో ఉన్న పంటలకు ఒకయూరియా బస్తా కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కావలసినంత యూరియా వెంటనే అందించాలని, లేకుంటే



పంటల దిగుబడి తగ్గుతుందని, రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు. వ్యవసాయ ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకొని వెంటనే యూరియా యాప్ ను ఎత్తివేయాలని, రైతులకు సరిపడా యూరియాను అందించాలని కోరుతూ వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, వ్యవసాయ శాఖ కమిషనర్,డైరెక్టర్, నల్గొండ జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ నల్గొండ జిల్లా అధికారికి ఈ విషయలపై వినతి పత్రాలను అందజేశామని తెలిపారు. రైతులకు న్యాయం చేసేందుకు, రైతుల పక్షాన న్యాయ పోరాటం చేసేందుకు వెనకాడనని చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన వెంట రైతు ప్రతినిధులు హాతీరాం నాయక్, మాజీ సర్పంచ్ రవీందర్ ఉన్నారు.

## రెండు నెలల పసికందును చంపిన వారికి కఠిన శిక్ష వేయాలి

**ఆలేరు రజక సంఘం అధ్యక్షుడు నరేందర్**



ఆలేరు ఫిబ్రవరి 23 ప్రజా జ్యోతి

కుమ్మర గ్రామ మల్లన్న జాతరలో దేవుడి దర్శనార్థం వెల్లిన గణేషు చంద్రకళ రజక కుటుంబాన్ని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ తుకారం రెడ్డి, శ్రీనివాసరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సతీష్ రెడ్డి కానీ రెడ్డి ఉపేందర్ రెడ్డి అడ్డుకోగా ఎందుకు అడ్డుకుంటున్నారు అని ప్రశ్నించగా బూతులు తిడుతూ దుర్భాషలాడుతూ తన భర్త పై బంధువులపై కిరాతకంగా దాడి చేసి రెండు నెలల పసికందును చూడకుండా కాలుతో తన్ని చంపిన వీరిపై ఎఫ్ ఐ ఆర్ ఐ మర్డర్ కేసు నమోదు చేసి చట్టపరేపైన చర్యలు తీసుకోవాలని రజక సంఘం ఆలేరు మండల అధ్యక్షులు వడ్డెమాను నరేందర్ అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో ఆలేరు తాసిల్దార్ ఆంజనేయులు కి వినతి పత్రం అందించి ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరుద్ధం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆలేటి అజయ్ కుమార్, ముదిగొండ శ్రీకాంత్, ఆలేటి అనిల్ కుమార్, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

**కారు ముందు టైరు పేలి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న కారుకి డి**

**ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి**

**కోదాడ రూరల్.ఫిబ్రవరి 23 ప్రజాజ్యోతి :**

కోదాడ మండల పరిధిలోని ద్వారకుంట గ్రామం సమీపంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు ముందుటైరు ఒక్కసారిగా పేలిపోవడంతో అదుపుతప్పి డివైడర్ దాటి ఎదురుగా వెళ్తున్న మరో కారును ఢీకొట్టడంతో ఉప్పెల్లి సత్యంబాబు (54) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ద్వారకుంట గ్రామ సమీపానికి రాగానే ముందుటైరు పేలింది. దీంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి డివైడర్ దాటి అవతల లేన్‌లోకి దూసుకెళ్లింది. అదే సమయంలో కోదాడ నుంచి చిమిర్యాల వైపు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో రెండు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాదం తీవ్రతతో సత్యంబాబు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు కోదాడ పట్టణంలోని నయానగర్‌లో ఉంటూ చర్చి పాస్టర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు.

**ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు..**

ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు శిమిరాల వెళ్తున్న క్రమంలో మార్గం మధ్యలో మృతి కబలించింది. సత్యం బాబుతో పాటు ఉన్న కారు డ్రైవర్‌కు ఒక చెయ్యి, కాలు విరగగా మెరుగైన చికిత్స కోసం కోదాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విజయవాడ నుంచి వస్తున్న కారులో సాయి దుర్గ, స్వప్న, గాయత్రి, మాధవి, నితీష్ మురళీకృష్ణ దుర్గ భవానీలకు గాయాలు కావడంతో వారిని చికిత్స కోసం హైదరాబాదులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలానికి చేరుకున్న రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంతో రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి, పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## జేఈఈ మెయిన్స్ టాపర్లను అభినందించినఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):
జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో 99. 56 పర్సంటైల్ సాధించిన రేస్ ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు ముక్కా చరణ్ సాయి గౌడ్, ఐ. కృష్ణ చరణ్, (95.63,) సిహెచ్ భాను శంకర్, (94.78) విజయ్ చరణ్ (92.52),, జె ప్రవీణ్ (92.16 ) లను సోమవారం క్యాంప్ ఆఫీసు నందు ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కోదాడ లాంటి పట్టణం నుండి విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు ఈ కళాశాల నుండి పలువురు విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ పర్సంటైల్ సాధించి ఎన్ఐటీ , జేఈఈ అడ్వాన్స్ లో ప్రవేశానికి అర్హత సాధించడం గర్వకారణమని జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు కూడా ఇదే స్ఫూర్తితో సిద్ధమై మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థలచైర్మన్ బాణాలవసంత వెంకటరెడ్డి , సిరికొండ శ్రీనివాస్, కె. శివ శంకర్, గద్దె సతీష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు.. సూపర్వైజర్ అంజలి

నార్కట్ పల్లి, ఫిబ్రవరి 23( ప్రజా జ్యోతి): మండల కేంద్రంలోని నెమ్మాని గ్రామంలోఐసిడిఎస్ ఆధ్వర్యంలో హైస్కూల్లో భేటీ పడావో – భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ అంజలి మాట్లాడుతూ.. బాల్య వివాహాలపై అవగాహన




సదస్సు నిర్వహించి, ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, టోల్ ఫ్రీనెంబర్స్, ట్రాఫికింగ్ పై వ్యక్తిగత పరిశుభ్రత, పై వివరించారు. బాల్య వివాహలపై విద్యార్థుల చేత వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో గెలీపొందిన విద్యార్థులకు ప్రథమ మరియు ద్వితీయ పోటీదారులు ఎంపిక చేసి హెడ్మాస్టర్ చేత బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెమ్మని హెడ్మాస్టర్, నీరజ, సూపర్వైజర్ అంజలి, స్కూల్ టీచర్లు, అంగన్వాడి టీచర్ పద్మ, రమాదేవి, దేవేంద్ర, కిషోర బాలికల తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అభినందనలు స్వీకరించిన కౌన్సిలర్ ఉమా అంజన్ గౌడ్

## భారీ మెజార్టీతో గెలుపొందిన 30వ వార్డు ప్రజాప్రతినిధికి శుభాకాంక్షలు



**కోదాడ టౌన్,ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):**

కోదాడ మున్సిపాలిటీ ఎన్నికల్లో 30వ వార్డు కౌన్సిలర్‌గా భారీ మెజార్టీతో విజయం సాధించిన కారింగుల అంజన్ గౌడ్ సతీమణి ఉమా అంజన్ గౌడ్‌ను కోదాడ జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసిఅభినందించారు.పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ, అంజన్ గౌడ్ జర్నలిస్టుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాడిన వ్యక్తి అని ప్రశంసించారు. అదే స్ఫూర్తితో ఉమా అంజన్ గౌడ్ కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ముఖ్యంగా జర్నలిస్టుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో రాజకీయాల్లో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుని పారదర్శక పాలన అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు నారప రాజు హరికిషన్, బంకా వెంకటరత్నం, వంగవీటి శ్రీనివాసరావు,కోట రాంబాబు, బాదే రాము,కొలిచలం నరేష్, పగడాలవాసు, బండి శ్రీను,జూలూరి బసవయ్య, సైదులు, శివ,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన చదువుతో మాత్రమే లక్ష్యాలను చేరుకోగలం



**నార్కట్ పల్లి, ఫిబ్రవరి 23( ప్రజా జ్యోతి) :**

మండలకేంద్రంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాధ్యాపకులు సాగి శైలేంద్ర కుమార్ శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువుతో సరైన లక్ష్యాలను ఎంపిక చేసుకున్నప్పుడు వాటిని సులువుగా చేరుకోగలరని విద్యార్థులకు ఉపోద్ఘించారు. విద్యార్థులు రాబోవు ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు శ్రద్ధగా చదివి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, మంచి ఫలితాలు పొందాలని అలాగే తమ తల్లిదండ్రులకు సమాజంలో మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య బృందం కరస్పాండెంట్ ముద్ధం నరసింహ గౌడ్, దూదిమెట్ల సత్తయ్య యాదవ్, వంగాల శ్రీనివాస్ రెడ్డి, కొప్పు నాగరాజుగౌడ్, ముద్రబోయిన మల్లేష్, కావటి సత్తయ్య, తరాల శ్రీశైలం, అధ్యాపకులు బ్రహ్మచారి, గణేశ్, రాజు, కిరణ్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్ చారి మరియు ప్రథమ, ద్వితీయ సంవత్సరప విద్యార్థులు పాల్గొన్నారు.

# యువతకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయిః బిజెపిరాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్,ఎర్రబెల్లి సర్పంచ్ ఐతగోనిమధు



**నిడమానూరు, ఫిబ్రవరి 23(ప్రజాజ్యోతి)**

యువతకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయిః బిజెపిరాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్,ఎర్రబెల్లి సర్పంచ్ ఐతగోనిమధు అన్నారు.సోమవారం మండలంలోని ఎర్రబెల్లి శ్రీ లింగమంతులస్వామి, మాణిక్యాలదేవిల జాతర సందర్భంగా జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఎర్రబెల్లి గ్రామంలో నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా బిజెపిరాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్ విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మన్నెం రంజిత్ యాదవ్ మాట్లాడుతూ యువతకు క్రీడలు మానసికఉల్లాసం కల్గిస్తాయి .ఎంతో ఉపయోగపడతాయని, యువకులను ఉత్సాహపరుస్తూ, క్రీడలవిషయంలో,తనవంతు సహకారం గ్రామానికి ఎప్పుడు ఉంటుందని భరోసనిచ్చాడు. ఈకార్యక్రమంలో ఎర్రబెల్లి గ్రామ సర్పంచ్ ఐతగోనిమధు, ఉపసర్పంచ్ కందుకూరి నవీన్ , ఆలయ కమిటీ చైర్మన్ మన్నెం వెంకన్న, వార్డ్ మెంబర్లు, రవి ,జానయ్య, బొంగరాల జానయ్య , రాజశేఖర్ రెడ్డి , మధు , సిద్దనూరు వెంకటేశ్వర్లు ,గ్రామ సెక్రెటరీ బిల్ కలెక్టర్ నరేష్ ,శివరాజ్, వట్టి కోటి ,శ్రావణ్ కుమార్, పెదమామ లాలయ, పెదమాము ఉపేందర్, మహేష్ ,గ్రామక్రీడాకారులు, యువకులు,ఆర్గనైజర్లు లింగయ్య పోన్ 9640295090సంప్రదించవల్సిందిగా కోరారు.

# ముదిరాజ్ సభ ఆధ్వర్యంలో ముదిరాజ్ కౌన్సిలర్లకు ఘన సన్మానం

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 23,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ పట్టణం లో ముదిరాజ్ సభ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణం లో సోమవారం ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో నూతన కౌన్సిలర్లుగా గెలుపొందిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన 2వ, వార్డ్ కౌన్సిలర్ గుడిసె జానకమ్మ దుర్గాప్రసాద్, 3వ, వార్డ్ కౌన్సిలర్ బంటు పద్మ లక్ష్మీనారాయణ,21వ, వార్డ్ కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు,45వ, వార్డ్ కౌన్సిలర్ బంటు వెంకటేశ్వర్లు, 46వ, వార్డ్ కౌన్సిలర్ బంటు శ్రీనివాస్ లను ఘనంగా సన్మానించారు. సందర్భంగా కోలా సైదులు, బంటు సైదులు, దాసరాజు జయరాజ్, లింగంపల్లి చిరంజీవి లు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో, ప్రజాసేవలో ఆదర్శంగా నిలిచి మిర్యాలగూడ అభివృద్ధికి నూతన కౌన్సిలర్లు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దోనేటి సైదులు, అవదారపు మురళి, తవిటి సైదులు, కొంక వెంకన్న, లింగంపల్లి మట్టయ్య, కోలా వెంకన్న, నక్క శేఖర్, శ్రీనివాస్,కోలా నాగరాజు, బంటు రమేష్, బంటు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం

**గుండాల, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):**

గుండాల మండలంలోని పాచిల్ల గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో శిశువులకు సంప్రదాయబద్ధంగా అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని అంగన్వాడి సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మహేష్ ఉప సర్పంచ్ రమేష్ వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు హాజరై చిన్నారులకు తొలి అన్నం పెట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పోషకాహారం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అంగన్వాడి టీచర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల బరువు,ఎత్తు కొలిచి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతన కౌన్సిలర్లకు సన్మానం



ఆలేరు ఫిబ్రవరి 23 ప్రజా జ్యోతి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీకి చెందిన మొదటి వార్డు కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్, యాట శివ, బీజాని కళ్యాణమదు లను కౌన్సిలర్ల గా నూతనంగా ఎన్నిక కావడంతో ను ఆలేరు మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సోమవారం రహదారి బంగ్లాలో శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, కుతాడి అంజన్, రాజేష్, సత్తయ్య, ఆంజనేయులు, సుజాత, టింకు ,దుర్గేష్ ,గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ పండుగకు హాజరైన మాజీ ఎమ్మెల్యే



ఆలేరు ఫిబ్రవరి 23 ప్రజా జ్యోతి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని శర్బనాపురం గ్రామంలో దుర్గమ్మ పండుగ సందర్భంగా ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సోమవారం హాజరై పూజలు నిర్వహించారు అనంతరం దేవుడికి నైవేద్యం పెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసయ్య, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మొగలగాని మల్లేశం, గ్రామ శాఖ అధ్యక్షుడు బిక్షపతి, గ్యాధపక మధు తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మీయ అభినందన సత్కారం

గుండాల, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గుండాల మండలానికి చెందిన వికలాంగులు జవ్వాజి మహేందర్,సింగారం రమేష్ లకు ఆత్మీయ అభినందన సత్కారం నిర్వహించారు.వీరు ఉత్తమ సామాజిక సేవకు గాను 2026 సంవత్సరానికి సంబంధించిన "మహాత్మా గాంధీ జాతీయ అవార్డు" అందుకున్న సందర్భంగా ఈ సత్కార కార్యక్రమం జరిగింది.దేశభక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుంగపట్ల యాకయ్య ముదిరాజ్ ఆధ్వర్యం వహించారు.కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు సదానందం ముదిరాజ్ అవార్డు గ్రహీతలకు మెమొంటోలు,శాలువాలు అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ,వికలాంగులుగా ఉన్నప్పటికీ సమాజ సేవలో ముందుండి ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్న జవ్వాజి మహేందర్,సింగారం రమేష్ ల సేవలను కొనియాడారు.వీరి సేవలు మరెందరికో ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సురేందర్,శ్రీనివాస్,దివాకర్,శంకర్ పాల్గొన్నారు.



# గిరిజనులను గుండెల్లో పెట్టి చూసుకుంటా...!







### శాంతివనం, సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేస్తా - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

### ఘనంగా సంత్ సేవాలాల్ 287 వ జయంతి ఉత్సవాలు

### సాంప్రదాయ వేషధారణ, నృత్యాలతో భారీ ర్యాలీ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 23,( ప్రజాజ్యోతి ):

సాంప్రదాయ వేషధారణ.. నృత్యాలు.. డీజే మోతలు..జయ జయ ద్వానాలు.. మహా భోగ్ బండార్ కార్యక్రమం తో తమ ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గిరిజనులు మిర్యాలగూడ పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మిర్యాలగూడ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొర్ర నాగు నాయక్ అధ్యక్షతన నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చిన గిరిజన ప్రజా ప్రతినిధులు ఉద్యోగులు, నాయకులు ప్రజలు సాంప్రదాయ రీతిలో వేడుకగా ఉత్సవం జరుపుకున్నారు. పట్టణంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్,సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు స్కైలాబ్ నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొనగా, అశ్వ వాహనంపై సేవాలాల్ విగ్రహాన్ని ప్రధాన వీధుల వెంట, సాంప్రదాయ నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తూ బంజారా భవన్ కు చేరుకున్నారు. గిరిజన సాంప్రదాయ రీతిలో భోగ్ బండార్ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మినీ రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి( బి ఎల్ ఆర్ ) మాట్లాడుతూ గోర్ బంజారా సమాజానికి నిజమైన దైవం ఆధ్యాత్మిక మార్గదర్శకుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. 18వ శతాబ్దంలోనే బంజారాల సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడేందుకు ఎనలేని కృషిని చేసిన మహానుభావుడు సేవాలాల్ అని అన్నారు. అహింస శాఖాహారం ధర్మం క్రమశిక్షణను పాటించాలని బోధించిన సేవాలాల్ మతమార్పిడులను, మూఢనమ్మకాలను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. తండాల అభివృద్ధికి విద్యకు స్త్రీల గౌరవానికి సేవాలాల్ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని ఆయన చూపిన మార్గంలోనే ఐకమత్యంతో ముందడుగు వేసి గిరిజన సమాజాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సామాజిక సేవలో ఉన్న తనను అక్కున చేర్చుకుని ఎమ్మెల్యేగా చేయటంలో కీలక పాత్ర పోషించిన గిరిజనులను తాను గుండెలో పెట్టి చూసుకుంటానని, వారి అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గిరిజన నాయకుడు శంకర్ నాయక్ కు ఎమ్మెల్సీ తో పాటు కాంగ్రెస్ పార్టీ ఆదివాసి చైర్మన్ పదవిని కూడా ఇచ్చి గౌరవించిందని ప్రభుత్వ తీరుకు ఇదే నిదర్శనం అన్నారు. త్వరలోనే ప్రభుత్వం రెండు ఎకరాల భూమిని కేటాయించినట్లయితే శాంతి వనం ఏర్పాటు చేసి, సేవాలాల్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ చూపిన మార్గంలో గిరిజన జాతి అభివృద్ధి కోసం ఐకమత్యంగా ముందుకు పోవాలన్నారు. సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ మాట్లాడుతూ గత ఏడాది ఎన్నికల కోడ్ ఉండటం వలన వేడుకలలో లోటుపాట్లు జరిగాయని, ఈసారి వేలాదిగా తరలివచ్చిన గిరిజనుల మధ్య సేవాలాల్ వేడుకలు ఘనంగా నిర్వహించటం హర్షనీయమన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ధీరావత్ స్కైలాబ్ నాయక్ మాట్లాడుతూ గిరిజన జాతి అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా ఐకమత్యంతో కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్,అరుణా బాయ్, ఆంగోత్ హాథిరాం నాయక్, ధీరావత్ రవితేజ నాయక్, మాలోతు దశరథ నాయక్, ధర్మానాయక్, రవి నాయక్, ఫాచ్చు నాయక్, ధనావత్ సిద్దు నాయక్, పలు మండలాల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**మునగాల, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):**

మునగాల మండలం జగన్నాధపురం గ్రామంలో మొదటిసారిగా బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకుడు బెల్లంకొండ ఉపేందర్ ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలో ఉన్న నేపథ్యంలో నిర్వహించిన ఈ ఇఫ్తార్ విందులో గ్రామ ప్రజలు, ముస్లిం అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బెల్లంకొండ ఉపేందర్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇఫ్తార్ విందు అనంతరం మసీదు కమిటీ సభ్యులు బెల్లంకొండ ఉపేందర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లికార్జున్, వార్డు సభ్యులు షేక్ మీరావలి, దైద



సైదులు, కమిటీ సభ్యులు ఎస్.కే లతీఫ్, ఖాసిం జాన్, సైదా, ఎస్.కే రంజాన్, ఎస్.కే నాగుల్ మీరా, పర్వేద్ లతీఫ్ అక్బర్, ఎస్.కే మీరా సాబ్, లాలు భాష, ఎస్.కే జానీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రామంలో సౌహార్ద వాతావరణాన్ని మరింత బలోపేతం చేసింది.

# ఆవులు తరలిస్తున్న వాహనం పట్టివేత




**9 ఆవులను గోశాలకు తరలింపు**

చిట్యాల ఫిబ్రవరి 23(ప్రజా జ్యోతి ప్రతినిధి): చిట్యాల పట్టణంలో ఆవులను తరలిస్తున్న బొలెరో వాహనమును పట్టి వేయడం జరిగింది పోలీసుల వివరాల ప్రకారం సోమవారం నాడు వాహనాల తనిఖీలలో భాగంగా కోదాడ నుండి చిట్యాల మీదుగా హైదరాబాద్ కు ఆవులు తరలిస్తున్న టీఎస్ 29 టీ 3458 నెంబర్ గల బోలేరా వాహనము ఆపి తనిఖీ చేయగా వాహనంలో 9 ఆవులు దగ్గర దగ్గరగా కట్టువేసి ఊపిరాడకుండా కబేలకు తరలిస్తున్న ఆవులను పట్టుకోవడం జరిగింది. డ్రైవర్ షేక్ జానీ భాషను అతని యజమాని వేముల అనిల్ కుమార్ లను పట్టుబడి చేసి కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్సైమామిడి రవికుమార్ తెలిపారు పట్టుబడి చేసిన ఆవులను గోశాలకు తరలించడం జరిగింది.

# ముకుందాపురంలోని ఇందిరా అనాథ వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు -- అన్నదానం, పండ్లు పంపిణీ

**మునగాల, ఫిబ్రవరి 23 ప్రజా జ్యోతి**

మునగాల మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ సమీపంలో



ఉన్న ఇందిరా అనాథ వృద్ధాశ్రమం లో ఇద్దరు కుటుంబాలు తమ పిల్లల జన్మదినాల సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన మొక్క



నాగార్జున--లక్ష్మి దంపతులు తమ కుమారుడు మొక్క గణేష్ జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే తాడ్వాయి గ్రామానికి చెందిన తంగెళ్ల నరేష్--శ్రావణి దంపతులు తమ కుమారుడు తంగెళ్ల ప్రజ్వల్ పుట్టినరోజు సందర్భంగా పండ్లు, పాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల్లో జరుపుకునే పుట్టినరోజులు, పెళ్లిరోజులు వంటి శుభసందర్భాల్లో వృద్ధాశ్రమాల్లో ఉన్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంతో మంచిదని సూచించారు. సమాజంలో మరింత మంది ఇలాగే స్పందించి అనాథ వృద్ధాశ్రమాలకు చేయూతనివ్వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమాల్లో మొక్క కోటయ్య, లక్ష్మమ్మ, గండు సైదులు, రేణుక శ్రీనివాస్, హైమా అఖిల, గండు ధర్మయ్య, రేణుక, శ్రీహరి, రమ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమాలు వృద్ధులకు ఆనందాన్ని కలిగించడంతో పాటు, సమాజానికి సానుకూల సందేశాన్ని అందించాయి.

# గ్రామాభివృద్ధిలో భాగంగా మహిళా సమాఖ్యకు స్వంత భవనం

**:- సర్పంచ్ సుంకరి పిచ్చయ్య**

**మునగాల ఫిబ్రవరి 23 ప్రజా జ్యోతి ):-**

విజయరాఘవాపురం గ్రామంలో మహిళల సాధికారతకు తోడ్పడే కీలక అడుగుగా మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. రూ.10 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ సుంకర పిచ్చయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు మరియు సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన స్థలదాత గన్న పుష్పమ్మ ను సర్పంచ్ మరియు గ్రామ పెద్దలు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కత్తి వెంకటేశ్వర్లు, జిల్లా కిసాన్ సేల్ అధ్యక్షులు బచ్చు ఆశోక్, పంచాయతీ రాజ్ ఏఇ వసంత, గ్రామపంచాయతీ కార్యదర్శి పి. ఉపేందర్ రావు, వార్డు మెంబర్ సోమపంగు శారద, సోమపంగు బుచ్చి రాములు, వివో ఏ లు విజయ కుమారి, జయశ్రీ, అలాగే రెమిడాల లింగయ్య, బెల్లంకొండ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



# మరమ్మత్తులతో నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

దామరచర్ల, ఫిబ్రవరి 23,( ప్రజాజ్యోతి ):

విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం దామచర్ల మండలంలోని 33/11 కే.వి. నూనావత్ తండా సబ్-స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఈ అబ్దుల్ హబీబ్ సోమవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని 11 కే.వి. నునవత్ తండా ఫీడర్, కొండ్రపోల్ ఫీడర్, కేశవపురం ఫీడర్, రాంకీ ఫీడర్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు గృహ, వ్యాపారస్థులు మరియు రైతులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు .



# పరీక్ష కేంద్రాల వద్ద తహసీల్దార్ లు బి యన్ ఎస్ ఎస్ -163 సెక్షన్ ను పకడ్బందీగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

నల్గొండ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి): ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగే పరీక్ష కేంద్రాల వద్ద తహసీల్దార్ లు బి యన్ ఎస్ ఎస్ -163 సెక్షన్ ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈనెల 25 నుండి మార్చి 18 వరకు (ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు) నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం జిల్లాలో 45 పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు రాయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో బీఎన్ఎస్ఎస్- 163 సెక్షన్ అమలు చేయాలని తహసిల్దారులను ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఈ సందర్బంగా కలెక్టర్ ఆదేశించారు.

# విల్లోవుడ్ కెమికల్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు

ఎగ్జోటికా గుళికల ద్వారా అధిక దిగుబడి.

టెరిటరీ సేల్స్ మేనేజర్ జి శ్రీకాంత్..




దేవరకొండ, ఫిబ్రవరి 23(ప్రజా జ్యోతి ) దేవరకొండ మండలం ఇద్దంపల్లి గ్రామంలో విల్లోవుడ్ కంపెనీ వారు ఎగ్జోటికా ప్రోడక్టుపై రైతులకు ఫీల్డ్ డే కార్యక్రమం నిర్వహించారు టెరిటరీ సేల్స్ మేనేజర్ జి శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ ప్రోడక్టు వాడడం వలన వరి పంటలో వచ్చే మొగ్గిపురుగు, ఆకు చుట్ట పురుగులను సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు, పంట దుబ్బుదల మెరుగుపడేందుకు మరియు అధిక పిలకలు రావడానికి ఉపయోగపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వరి పంటలో కనిపించే అగ్గి తెగులు, బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు, మరియు పాముపొడ తెగులు వంటి తెగుళ్ళ నివారణకై వారెక్స్ 400 మిల్లీ. మరియు బ్రాండ్ ఎస్ఎల్ 100 మిల్లీ. ఎకరానికి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విలువుడ్ కంపెనీ ప్రతినిధులు డెవలప్మెంట్ ఆఫీసర్ యం కరుణ్ కుమార్ , మరియు పరమేశ్వర ఫర్టిలైజర్ పర్వతాలు, వివిధ ప్రాంతాల రైతులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మైనారిటీ ఉచిత రుణాల కొరకు దరఖాస్తు ల ఆహ్వానం

భువనగిరి,ఫిబ్రవరి 23

(ప్రజాజ్యోతి)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల ఆర్థికాభివృద్ధి, స్వయం, ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఫ్సీ ) ఆధ్వర్యంలో ఆర్థిక సహాయ పథకం (ఎకనామిక్ సపోర్ట్ స్కీం ) క్రింద రెండు ముఖ్య మైన పథకాలను 2025--26 ఆర్థిక సంవత్సరానికి అమలులోకితీసుకువచ్చినట్లు తెలిపారు.తుర్కాకాశా ముస్లిం వర్గానికి టూల్‌కిట్లు ఁ జనరేటర్ల పంపిణీ,రాళ్లు కత్తిరించే వృత్తిలో నిమగ్నమైన పేద తుర్కా కాశా ముస్లిం, వర్గానికి చెందిన లబ్ధిదారుల పునరావాసం,జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా ఈ పథకం అమలు చేయబ డుతుంది.ప్రతి లబ్ధిదారుడికి రూ.60,000/- చొప్పున రూ.10,000/- విలువైన టూల్‌కిట్ మరియు రూ.50,000/- విలువైన జనరేటర్ ను 100% సబ్సిడీతో ఒకేసారి అందించబడుతుంది.మైనారిటీ యువతకు ఈ-స్కూటర్ల పంపిణీ (పైలట్ ప్రాజెక్ట్) మైనారిటీ యువత (పురుషులు)ఆర్థికంగా బలోపేతం కావడానికి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ-స్కూటర్ల పంపిణీ పథకం అమలులో ఉంది.ఈ పథకంలో ఈ-స్కూటర్ యూనిట్ వ్యయం సుమారు రూ.1.50 లక్షలు కాగా, అందులో 80% సబ్సిడీ (రూ.1.20 లక్షలు) ప్రభుత్వం అందిస్తుంది. మిగిలిన 20% (రూ.30,000/-) లబ్ధిదారుడి వాటాగా ఉంటుంది. ఎంపికైన లబ్ధిదారులను ఉబర్ / రాపిడో / ఓలా వంటి సేవా సంస్థలతో అనుసంధానం చేయడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించబడతాయి.ఆన్‌లైన్ దరఖాస్తుల వివరాలుఈ రెండు పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులుతేది:20-02-2026 ఉదయం 10:30 గంటల నుండి తేది: 01-03-2026 రాత్రి 11:59 గంటల వరకు ఁ+హదీవీమీ వెబ్‌సైట్ : స్వీకరించబడతాయి. ఎలిజిబిలిటీ తుర్కా కాశా ముస్లిం కమ్యూనిటీ సర్టిఫికేట్ ఆధార్ కార్డు మరియు ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) లను చిరునామా ఆధారంగా తప్పనిసరిగా సమర్పించాలి.

# కోమటి రెడ్డి ప్రతిక్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల తనిఖీ

జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్

9వ తరగతి విద్యార్థులకు గణితం బోధించిన జిల్లా కలెక్టర్



నల్గొండ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ




పాఠశాలల ద్వారా ప్రయివేట్ పాఠశాలలకు మించి విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ చెప్పారు. సోమవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతిక్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, బోధన విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా 9వ తరగతి గణితం తరగతిలోకి వెళ్లి విద్యార్థులతో చర్చిస్తూ స్వయంగా గణిత పాఠాలను బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి అవగాహన స్థాయిని తెలుసుకున్నారు. సబ్జెక్టుపై పట్టు పెంచుకోవాలని, ప్రతిరోజూ ప్రాక్టీస్ చేయాలని, లక్ష్యాన్ని పెట్టుకుని చదవాలని విద్యార్థులకు సూచించారు. గణితంలో తడబాటుకు గురవుతున్న అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా విద్యార్థులకు వివరించి విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, క్లాస్ రూమ్స్ పరిస్థితి, ఫర్నిచర్, విద్యుత్ తదితర సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు నిరంతరం కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు సమానంగా అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. డి ఈ ఓ భిక్షపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ' జన 'నేత .. ' గిరిజన ' నేతపై ఆప్యాయత కురిపించిన వేళ...!

## హర్షం వ్యక్తం చేసిన జనం

మిర్యాలగూడ, ఫిబ్రవరి 23,( ప్రజాజ్యోతి ):

నమ్ముకున్న వారికి తన కడుపులో నుండి తీసిపెట్టే ఆప్యాయత ఆయనది.. ఆయన జననేత మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బిఎల్ఆర్ ).. నమ్ముకున్న నాయకుడి కోసం ఎంతటి కష్టాన్నైనా ఎదురు నిలిచి పోరాడే తత్వం గిరిజన నేత, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధీరావత్ స్కైలాబ్ నాయక్ ది.. సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ స్కైలాబ్ నాయక్ కు అన్నం తినిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి స్నేహ బంధానికి, ఆప్యాయతకు వేలాదిగా తరలివచ్చిన గిరిజనులు



అబ్బురపడ్డారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి): పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని వేగంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా వెంటనే పరిశీలించి, నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సోమవారం మొత్తం 138 వ్యాధులు రాగా రెవిన్యూ శాఖకు 78 , తక్కిన 60 వివిధ శాఖలకు చెందిన ఫిర్యాదులు ఉన్నాయి. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, చండూరు ఆర్టీవో శ్రీదేవి, దేవరకొండ ఆర్డి ఓ. రమణారెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.



# ఇంజనీరింగ్ శాఖలు చేపట్టిన పనులను ప్రాధాన్యత క్రమంలో, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలి

## అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్గొండ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి): వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన పనులను ప్రాధాన్యత క్రమంలో, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అంగన్వాడి కేంద్రాలు, మూత్రశాలలు, అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాల ప్రహరీ గోడలు, కాంపౌండ్ గోడలు, మూత్రశాలల నిర్మాణం వంటి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. చిన్నారులు మరియు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందేలా నాణ్యతతో పనులు చేయాలని సూచించారు. అదేవిధంగా పీఎం శ్రీ పాఠశాలలు, మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయాలని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ డి ఎఫ్, ఎంపీ లాడ్స్ నిధులతో చేపడుతున్న పనులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. రెవిన్యూ అదనపుకలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా అధికారులు పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి ఎలక్ట్రిసిటీ ఈడబ్ల్యుఐడీసీ తదితర ఇంజనీరింగ్ శాఖల అధికారులు, తదితరులు హాజరయ్యారు.

# ఇంటి దొంగలను ఈశ్వరకూడ పట్టుకోలేడు

## వారం లో మూడు రోజులు ఇక్కడే ఉంటా

## ఈ జి ఎస్ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం

## మైనారిటీ గురుకుల పాఠశాల నిర్మాణానికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే మందుల సామెల్

తుంగతుర్తి ఫిబ్రవరి 23,(ప్రజా జ్యోతి):

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై ఎమ్మెల్యే మందుల సామెల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పరిశీలించి, విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇంటి దొంగలను ఈశ్వరకూడ పట్టుకోలేడని, మనలోనే కొందరి కారణంగా ఓటమి చెందాల్సి వచ్చిందని అన్నారు. ఇకనుండి ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు వారంలో మూడు రోజులు నియోజక కేంద్రంలో నీ క్యాంపు కార్యాలయంలో ఉండి, ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం కోసం కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కొత్త ,పాత వారు అనే భేద అభిప్రాయాలు లేవని, అందరూ ఒకే గొడుగు కింద ఉండి రానున్న స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపు గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. తుంగతుర్తి లో రెండు కోట్ల రూపాయలతో బంజారా భవన్ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా నియోజకవర్గానికి 3500 ఇండ్లు వచ్చాయని, పేద ప్రజలు ఇంటి నిర్మాణ పనులు చేపట్టుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు రైతు రుణమాఫీ, రైతు భరోసా మహాలక్ష్మి పథకం పింఛన్లు ఇందిరమ్మ ఇండ్లు , సన్న బియ్యం పంపిణీ అభివృద్ధి పథకాలు పేద ప్రజల గుండెల్లో నిలిచిపోతాయని అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల భవ నిర్మానం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తుంగతుర్తి అభివృద్ధి నా ధ్యేయమని అందులో నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు. ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.అలాగే ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను సమర్థంగా



వినియోగించి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మౌలిక వసతులు అభివృద్ధి తాగునీరు రహదారులు విద్యుత్ వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతోనే అభివృద్ధి సాధ్యమంటూ ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల్లో కలిసికట్టుగా పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు.ఈ సమావేశం లో మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, నూతనల్ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పచ్చిపాల సుమతి వెంకన్న,సర్పంచులు దాసరి రేణుక శ్రీనివాస్, కలకోట్ల మల్లేష్, చింతకుంట్ల మంజుల వెంకన్న, జ్యోతి భాస్కర్,నాయకులు పెద్ద బోయిన అజయ్, మాచర్ల అనిల్, ఎనగందుల సంజీవ, పాల్వాయి నాగరాజు,వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రజకుల ప్రాణానికి విలువ లేదా

## కులం వివక్షత పై ఆగని దాడులు

## రెండు నెలల చిన్నారిని చిదిమేసిన వైనం

## న్యాయం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా రజక సంఘ నాయకుల డిమాండ్

**కోదాడ టౌన్,ఫిబ్రవరి 23 ( ప్రజా జ్యోతి ):**

పసిప్రాణాన్ని బలిగొన్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామ రజక సంఘ నాయకులు గరిడేపల్లి రాము డిమాండ్ చేశారు. నాగర్ కర్నూలు జిల్లా కొమురెల్లి అనే గ్రామంలో గణేష్ మౌనిక దంపతులకు జన్మించిన రెండు నెలల చిన్నారి అగ్రకుల నాయకుల ఆకృత్యాలకు బలి అయిన సంఘటన విషయం విధేయతమే. ఈ విషయంపై రజక సంఘం నాయకుడు రాము మాట్లాడుతూ దళితురాలు ఒక జాతరలో దైవదర్శన కోసం వెళ్ళిన సందర్భంలో సంబంధిత వ్యక్తులపై దైవదర్శనం కల్పించకుండా రెండు నెలల చిన్నారితో వచ్చిన మహిళపై విచక్షణ రహితంగా దైవదర్శనానికి అనుమతించకుండా ఆమెపై దాడి చేశారు దేవదర్శనానికి వెళ్లిన సదరు మహిళ కుటుంబం తో శ్రీనివాసరెడ్డి సతీష్ లు గుడి లోపలికి వెళ్లాలంటే రొక్కం చెల్లించాలని డిమాండ్ చేశారు సదరు బాధిత మహిళ డబ్బులు ఎందుకు చెల్లించాలని దైవదర్శనానికి ఉచిత అనుమతి ఇవ్వాలని వారితో వాగ్వాదానికి దిగారు ఈ నేపథ్యంలో శ్రీనివాసరెడ్డి , సతీష్ రెడ్డి అను వ్యక్తులు వారినీ గుడి లోపలకి అనుమతించడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తూ సదరు మహిళా కుటుంబంపై బాగ్వాదానికి దిగారు ఈ నేపథ్యంలో ఇరు వర్గాలకు వాగ్వాదం చోటుచేసుకోవడంతో మహిళపై శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి అనుచరులతో దాడి చేశారు. కాగా మహిళా ఒడిలో ఉన్న రెండు నెలల చిన్నారి శ్రీనివాసరెడ్డి అతని అనుచరులతో చేసిన దాడిలో మృతి చెందింది. కాగా ఈ చిన్నారి మృతిపై తల్లిదండ్రులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలు అగ్రవర్గ అహంకారంతో ఉన్న సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అగ్రకులవర్గ న్యాయాధితను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సదరు తల్లిదండ్రులు కోల్పోయిన పసిపాప ప్రాణాన్ని ఈ అగ్రకుల వర్గాలు తెచ్చేయగలరా అని ఆయన ప్రశ్నించారు. కులవర్గాలను అడ్డం పెట్టుకొని రాజ్య పాలన సాగిస్తున్న వ్యక్తులను వెంటనే ప్రభుత్వ పరంగా శిక్షించి సదరు బాధిత కుటుంబం చిన్నారికి న్యాయం చేకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు.



# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**నాంపల్లి, ఫిబ్రవరి,23(ప్రజా జ్యోతి):**

పట్టణ కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గడ్డం గణపతి అకాల మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ జడ్పిటిసి సభ్యులు ఏవి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి సంజీవ రెడ్డి రాజు మృతుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ వంతుగా చేరో రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందజేసి, కుంటుంబానికి అండగా ఎల్లవేళల సహాయ సహకారాలు కుటుంబానికి ఉంటాయని ధైర్యాన్ని ఇచ్చారు. అలాగే స్థానిక వార్డు సభ్యులు శ్వేత రమేష్ రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పానగంటి నిర్మల వెంకటయ్య, వార్డు సభ్యులు, అభిమానులు మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# పరిశ్రమలలో నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

## - ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హెచ్చరిక



**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి)**

మండలంలోని వి.జె సాయి కెమికల్ కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సోమవారం కంపెనీని సందర్శించి పరిస్థితులను సమీక్షించారు.



ప్రమాదానికి గల కారణాలపై అధికారులతో చర్చించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, భద్రతా పరికరాల వినియోగం, కార్మికులకు అందిస్తున్న రక్షణ సామగ్రి, అత్యవసర స్పందన వ్యవస్థలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలుష్య నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. పరిశ్రమల వల్ల పరిసర గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, కాలుష్య నియంత్రణ బోర్డు మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని ఆయన హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని స్పష్టం చేశారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డిసిపి మధుసూదన్ రెడ్డి, సిఐ రాములు, ఎస్సై భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 24న నాంపల్లిలో అధికారికంగా సేవాలాల్ జయంతి

నాంపల్లి, ఫిబ్రవరి,23(ప్రజా జ్యోతి):శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని ఈ నెల 24న నాంపల్లి మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్లో మునుగోడు నియోజకవర్గం స్థాయిలో అధికారికంగా నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ గూగులోతు దేవసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ నేతృత్వంలో జరిగే వేడుకలకు చండూర్ ఆర్డీవో శ్రీదేవి పాల్గొననున్నారు. మండల సర్పంచులు, నాయకులు, బంజారా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా ... నిధులు మంజూరు చేయిస్తా... పట్టణాన్ని అభివృద్ధి చేసుకోండి

## కోదాడ మున్సిపాలిటీ ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకోవాలి

## సమన్వయంతో సహకారంతో ప్రజల సమస్యలను పరిష్కరించాలి

## కోదాడ చైర్ పర్సన్ వైస్ చైర్ పర్సన్ పదవులకు వన్నె తేవాలి

## కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్

**కోదాడ టౌన్, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం కోదాడ మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని, చైర్మన్ వైస్ చైర్మన్ పాలకవర్గ సభ్యులు కలిసికట్టుగా పట్టణాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు ఎమ్మెల్యే పద్మావతి ఉత్తం అన్నారు.సోమవారం కోదాడ మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ గా కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్ పర్సన్ గా



దేవరపల్లి మల్లేశ్వరి లు పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారిని అభినందించి మాట్లాడారు. పాలకవర్గ సభ్యుల సమన్వయంతో పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పట్టణాన్ని అని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోని ఆదర్శ మున్సిపాలిటీగా కోదాడలో నిలపాలి అన్నారు. ఆదర్శవంతంగా పనిచేసి కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ వైస్ చైర్ పర్సన్ పదవులకు వన్నె తేవాలన్నారు. పట్టణ అభివృద్ధిలో ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తేవాలన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు , అధికారులు ఉన్నారు.



# భీమనపల్లి గ్రామంలో మద్యపాన నిషేధం

## - సర్పంచ్ కర్నాటి వరలక్ష్మీ

**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి)**

మండలంలోని భీమనపల్లి గ్రామ యువత సమర్పించిన దరఖాస్తును అనుసరించి గ్రామంలో మద్యపాన నిషేధం అమలు చేయాలని గ్రామ పంచాయతీ నిర్ణయించింది. సోమవారం నిర్వహించిన గ్రామపంచాయతీ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించి సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. గ్రామంలో మద్యపాన నిషేధం 01-03-2026 నుంచి అధికారికంగా అమలులోకి వస్తుందని తెలిపారు. గ్రామ పరిధిలో మద్యం విక్రయాలు పూర్తిగా నిషేధించబడతాయని స్పష్టం చేశారు. మద్యం అమ్మేవారికి గ్రామపంచాయతీ తరఫున నోటీసులు జారీ చేయనున్నట్లు




పేర్కొన్నారు. ఈ నోటీసులను అతిక్రమించి ఎక్కడైనా మద్యం విక్రయాలు నిర్వహించినట్లయితే, సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ కర్నాటి వరలక్ష్మీ ఒక ప్రకటనలో హెచ్చరించారు. గ్రామ అభివృద్ధి, యువత భవిష్యత్ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ తృతీయ వార్షికోత్సవం..

**నూతనకల్.. ఫిబ్రవరి 23(ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామంలో దుర్గమ్మ పండుగ తృతీయ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాండవుల లింగయ్య దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో దుర్గమ్మ పండుగ వేడుకలను నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యూత్ సంఘాల నాయకులు,భక్త ప్రజల పాల్గొన్నారు.



## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన : కాసాల జనార్దన్ రెడ్డి

చండూరు ఫిబ్రవరి 23(ప్రజా జ్యోతి)

నల్లగొండ జిల్లా చండూరు మండలం చొప్పరి వారి గూడెం గ్రామానికి చెందిన ఏనుగు అమరేందర్ రెడ్డి మాతృమూర్తి ఏనుగు పుష్పమ్మ అకాల మరణానికి చింతిస్తూ,వారి మృతదేహానికి పూలమాల వేసి, వారి కుటుంబాన్ని పరామర్శించి,నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు,మాజీ ఉప సర్పంచ్ కాసాల జనార్దన్ రెడ్డి కార్యక్రమంలో వారితోపాటు చొప్పరివారి గూడెం గ్రామ సర్పంచ్ జాల వెంకన్న,చొప్పరివారి గూడెం గ్రామ మాజీ సర్పంచ్ చొప్పరి వెంకన్న,కాంగ్రెస్ పార్టీ చొప్పరివారి గూడెం గ్రామ శాఖ అధ్యక్షులు చొప్పరి రాజు,ఇందిరమ్మ గృహ కమిటీ సభ్యులు వందనపు నరేందర్,పార్టీ నాయకులు పాల్గొన్నారు..



# జేఈఈ మెయిన్స్‌లో 'రేస్' విద్యార్థుల ప్రభంజనం:

### ప్రతిభావంతులను అభినందించిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**కోదాడ రూరల్, ఫిబ్రవరి 23 ( ప్రజాజ్యోతి):**

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కోదాడ గడ్డ సత్తాను చాటిన రేస్ ఐఐటీ ಆ మెడికల్ అకాడమీ విద్యార్థులను కోదాడ శాసనసభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి ఘనంగా అభినందించారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన





ప్రత్యేక కార్యక్రమంలో, జాతీయ స్థాయిలో 99.56 పర్సంటైల్ సాధించిన విద్యార్థులు తమ అధ్యాపకులతో కలిసి ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రతిభావంతులైన విద్యార్థులను శాలువాలతో సత్కరించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి కఠినమైన పోటీ పరీక్షలో జాతీయ స్థాయిలో టాప్ పర్సంటైల్ సాధించడం సామాన్యమైన విషయం కాదని, విద్యార్థుల కఠోర శ్రమ, అంకితభావం ఈ ఫలితాల్లో కనిపిస్తోందని ఆమె కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కోదాడ వంటి ప్రాంతంలో ఉంటూ జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన శిక్షణ అందిస్తూ, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్న రేస్ ఐఐటీ అకాడమీ యాజమాన్యాన్ని, అధ్యాపక బృందాన్ని అభినందిస్తున్నాను. గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థులు ఐఐటీల్లో సీట్లు సాధించడం ద్వారా వారి కుటుంబాల భవిష్యత్తు మారడమే కాకుండా, మన నియోజకవర్గానికి మంచి గుర్తింపు వస్తుంది అని పేర్కొన్నారు. ముందు జరగబోయే అడ్వాన్స్డ్ పరీక్షల్లో కూడా ఇదే పట్టుదలతో రాణించి, దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ప్రవేశం పొందాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని విద్యా రంగం అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నత చదువులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేస్ ఐఐటీ ಆ మెడికల్ అకాడమీ డైరెక్టర్లు, వివిధ సబ్జెక్టుల నిపుణులైన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అద్భుత స్కోరు సాధించిన విద్యార్థులను చూసి తోటి విద్యార్థులు స్ఫూర్తి పొందాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.



# కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ సహకారం తో కోదాడ పట్టణాన్ని అభివృద్ధి చేస్తా

**అందరి సహకారం తో కోదాడ ను అభివృద్ధి లో జిల్లా లో అగ్ర స్థానంలో నిలుపుతా**

**అందరి ఆశీస్సులతో కోదాడ మునిసిపల్ పదవి చేపట్టా**

**ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కి ఋణ పడి ఉంటా**

**పట్టణ అభి వృద్ధిలో పాలక వర్గం భాగ స్వాములు కావాలీ**

**ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ సమక్షంలో మున్సిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు**

**శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే చందర్ రావు, నాయకులు**

**కోదాడ టౌన్, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):**



కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ సహకారం తో కోదాడ పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు అన్నారు. సోమ వారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ సమక్షంలో మున్సిపల్ చైర్ పర్సన్ గా పదవి బాధ్యత లు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ తనకు మునిసిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కి, మంత్రి ఉత్తమ్ కి ఋణ పడి ఉంటానన్నారు. అందరి సహకారం తో కోదాడ ను అభివృద్ధి లో జిల్లా లో అగ్ర స్థానంలో నిలుపుతా అన్నారు. పట్టణ అభి వృద్ధిలో పాలక వర్గం భాగ స్వాములు కావాలన్నారు. కోదాడ పట్టణం లో మౌలిక సదుపాయాల కల్పన కు నిధులు మంజూరు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రజలు తమ సమస్యల ను వార్డు కౌన్సిలర్ ల ద్వారా తమ దృష్టి కి తేవాలన్నారు. అధికారులు సమస్యల పై వెంటనే సాధించాలన్నారు. కాగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ కుసుమ వెంకట్ రత్నం బాబు, వైస్ చైర్మన్ దేవర పల్లి మల్లేశ్వరి లను ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ గజ మాల తో అభినందించారు. కాగా చైర్మన్, వైస్ చైర్మన్ లను మాజీ ఎమ్మెల్యే చందర్ రావు, , కౌన్సిలర్ లు నాయకులు అభిమానులు కార్య కర్తలు తది తరులు శుభా కాంక్షలు తెలిపారువైస్ చైర్మన్ గా బాధ్యత లు స్వీకరించిన దేవరా పల్లి మల్లేశ్వరి..... కోదాడ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గా దేవర పల్లి మల్లేశ్వరి ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ సమక్షంలో బాధ్యత లు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన ఎంపిక కు సహాకారం అందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల కు కృతజ్ఞతలు తెలిపారు. కోదాడ పట్టణ అభివృద్ధికి పాలక వర్గం తో కలిసి కృషి చేస్తానన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరి బాధ్యత

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**అరైవ్ అలైవ్ కార్యక్రమం**

**రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం**

**నల్గొండ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి)**

నల్గొండ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో "అరైవ్ అలైవ్" కార్యక్రమం భాగంగా గుర్రంపోడు మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు చాలా వరకు నిర్లక్ష్యం, అతివేగం,



ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన లోపం వలననే



జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. యువత అధిక వేగంతో వాహనాలు నడపడం వలన ప్రాణ నష్టం జరుగుతోందని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా శిక్షార్హమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా, వాహనదారులు తమ వాహన పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. పాఠశాలలు, కళాశాలలో, యువతకు గ్రామస్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీల సహకారంతో రోడ్డు భద్రతపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ప్రమాదవశత్తు గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్సగా తక్షణ చర్యలో భాగంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై డాక్టర్లచేత సిపిఆర్ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవరకొండ డి ఎస్పి శ్రీనివాసరావు, మల్లెపల్లి సీఐ నవీన్ కుమార్, గుర్రంపోడి ఎస్సై వెంకన్న, డిటిఆర్బి రిటైర్ సీఐ అంజయ్య స్థానిక ప్రజలు, యువత, ఆటో మరియు ఇతర వాహనదారులు, పాల్గొన్నారు.

# ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

చింతపల్లి ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి)చింతపల్లి మండలంలోని చేపట్టిన ఉపాధిహామీ పనులను ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం సోమవారం పరిశీలించారు.బృందం సభ్యులు దిల్కుష్ మీనా,సంజయ్ పాండే గ్రామాల్లో జరిగే ఉపాధి పనులను తనిఖీలు చేశారు.మండలంలోని మెదుగులమల్లెపల్లి,తక్కళ్ళపల్లి గ్రామాల్లో పర్యటించి స్థానిక ఉపాధి కూలీలతో మాట్లాడి పూర్తి సమాచారం అడిగి తెలుసుకున్నారు.కేంద్రం నుండి వచ్చే నిధులను ప్రజలు






సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత సంవత్సరం క్రితం జరిగిన పనులు నర్సరీలు,కంధకాలు, రాళ్లు ఏరడం, ప్లాంటేషన్స్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బృంద ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధిహామీ పనులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న ,అధికారులు ఎలాంటి ఇబ్బంది పెట్టిన,ఇంకా ఏ పనులు అవసరం ఉందో తెలిపితే కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయిస్తామన్నారు.గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నల్గొండ పీడీ శేఖర్ రెడ్డి,ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ ఇందుజా,సర్పంచి ముద్దం మల్లేష్ గౌడ్,ఉపాధి సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు,రాజు, నాగేంద్ర,పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## రజకుల ప్రాణానికి విలువ లేదా?

**కుల వివక్షతపై ఆగని దాడులు-న్యాయం చేయాలని రజక సంఘాల ధర్నా**

**గుండాల, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):**

కుల వివక్షత కారణంగా అమాయక పసిప్రాణం బలైన ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని రజక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన సంఘటనను నిరసిస్తూ గుండాల మండలం మరిపడిగ గ్రామానికి చెందిన రజక పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు సింగారం ఉప్పలయ్య ధర్నాలో పాల్గొన్నారు.కొమురెల్లి గ్రామానికి చెందిన గణేష్--మౌనిక




దంపతుల రెండు నెలల చిన్నారి దేవాలయ దర్శనం సందర్భంలో జరిగిన ఘర్షణలో ప్రాణాలు కోల్పోయినట్లు నాయకులు తెలిపారు. దర్శనానికి వచ్చిన బాధిత కుటుంబాన్ని అనుమతించకుండా డబ్బులు డిమాండ్ చేయడంతో వాగ్వాదం చోటుచేసుకుని,ఆ తర్వాత జరిగిన దాడిలో చిన్నారి మృతి చెందినట్లు ఆరోపించారు.ఈ ఘటనకు బాధ్యులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రజక జనచైతన్య సమితి అధ్యక్షులు గంపల శ్రీనివాస్,రాష్ట్ర నాయకులు ఉల్లంగుల నర్సింగులు,మాదరాజు యాకన్న,మావిడాల భాను,సుడిగాల రమేష్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు.

## ఆర్థిక సాయం అందజేత



**చండూరు ఫిబ్రవరి 23(ప్రజా జ్యోతి)**

నల్గొండ జిల్లా చండూరు మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన పట్ల వెంకన్న కు గాలి మిషన్ (పంచర్ డబ్బా) కొరకు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసాల జనార్దన్ రెడ్డి 5000 రూపాయలు ఆర్థిక సహాయం సోమవారం అందజేయడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### అనారోగ్య బాధితులకు ఆర్థిక సహాయం

-19వ వార్డు కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ

హుజూర్ నగర్, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ):

పట్టణంలోని 19వ వార్డులో వార్డు కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న వల్లపుదాసు కోటయ్య, బత్తిని వెంకయ్య లను వారి బృందం సభ్యులతో కలిసి సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేసి, కుటుంబ సభ్యులకు కొండంత భరోసాను కల్పించారు. క్లిష్ట సమయంలో ఇలాంటి సహాయం అందించడం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ రఫీ, సైదా మేస్త్రి, మీరా, అలీ, బాబా, సలీం, షఫీ, పవన్, పొనుగుపాటి సత్యమయ్య, ఇమ్రాన్, సమీర్, నాగూల్ మీరా, టీమ్ 19 కార్యకర్తలు పాల్గొన్నారు.



## బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా చూడాలి

**పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**నల్గొండ టౌన్ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి)**

నల్గొండ జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నేరుగా బాధితుల వినతులను స్వీకరించి, వారి సమస్యలను ఓర్పుతో విన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 40 మంది పిర్యాదుదారులు తమ వ్యక్తిగత, భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు మరియు ఇతర ఫిర్యాదులను సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా



పరిశీలించి, సంబంధిత అధికారులకు తక్షణ విచారణ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గ్రీవెన్స్ డే కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా ఉన్నతాధికారులను కలుసుకొని తమ సమస్యలను వెల్లడించుకునే అవకాశం లభిస్తోందని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా ఫాలోఅప్ చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధితులు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సిపిఐ జాతీయ కార్యదర్శి పల్ల వెంకటరెడ్డి

**మునుగోడు, ఫిబ్రవరి, 23, (ప్రజా జ్యోతి)**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నారబోయిన రవి తండ్రిమునుగోడు మండలపరిషత్ రిటైర్డ్ ఉద్యోగి అయిన నారబోయిన కనకయ్య మరణించడం జరిగింది మరణించిన వార్త తెలుసుకున్న ,సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్ల వెంకటరెడ్డి, మాజీ సిపిఐ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు అంతిమయాత్రలు పాల్గొనడం జరిగింది అనంతరం అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు కనకయ్య మరణ వార్త తెలుసుకున్న భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మరియు మాజీ మంత్రి ,సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి నారబోయిన రవి ఫోన్ లో పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు



# దాచారం గ్రామంలో అభివృద్ధి జోరు,

## సమైక్య భవనానికి శంకుస్థాపన

## జెడ్పీహెచ్ఎస్‌లో సీసీ కెమెరాల ప్రారంభం

## ఎమ్మెల్యే మందుల సామేలు

**మోత్కూరు ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం పరిధిలోని దాచారం గ్రామంలో గ్రామాభివృద్ధికి దోహదపడే కీలక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. నూతనంగా నిర్మించనున్న గ్రామ సమైక్య భవనం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం, అలాగే జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమాలకు తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేసి, సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సమైక్య భవనం నిర్మాణం ద్వారా గ్రామ ప్రజలకు సమావేశాలు, మహిళా సంఘాల కార్యక్రమాలు, యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా విద్యార్థుల భద్రత మరింత బలపడుతుందని, విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ఇది దోహదం చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి దిశగా చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు దాచారం గ్రామానికి కొత్త ఉత్సాహాన్ని నింపాయని గ్రామస్తులు హర్షందాచారం గ్రామంలో అభివృద్ధి జోరు-- సమైక్య భవనానికి శంకుస్థాపన, జెడ్పీహెచ్ఎస్‌లో సీసీ కెమెరాల ప్రారంభం ఎమ్మెల్యే మందుల సామేలు చేతుల మీదుగా మోత్కూర్ మండలం పరిధిలోని దాచారం గ్రామంలో గ్రామాభివృద్ధికి దోహదపడే కీలక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. నూతనంగా నిర్మించనున్న గ్రామ సమైక్య భవనం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం, అలాగే జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమాలకు తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేసి, సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సమైక్య భవనం నిర్మాణం ద్వారా గ్రామ ప్రజలకు సమావేశాలు, మహిళా సంఘాల కార్యక్రమాలు, యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా విద్యార్థుల భద్రత మరింత బలపడుతుందని, విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ఇది దోహదం చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి దిశగా చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు దాచారం గ్రామానికి కొత్త ఉత్సాహాన్ని నింపాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వ్యక్తం చేశారు.



# గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ : ఎంపీ రఘువీర్ రెడ్డి

## - రూ.2 కోట్ల రూపాయలతో నిర్మించిన బంజారా భవన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే జై వీర్

**హాలియా,ఫిబ్రవరి23(ప్రజా జ్యోతి) :**

గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ అని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. సంతు సేవాలాల్ మహారాజ్ 287 జయంతి సందర్భంగా హాలియాలోని బంజారా భవన్ లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంతు సేవాలాల్ మహారాజ్ అత్యంత ఆదర్శప్రాయుడని బంజారా అభ్యున్నతికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రజా ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ మఠాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బంజారాల అభివృద్ధికి తన తండ్రి మాజీ సిఎల్పీ నేత కుందూరు జానారెడ్డి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అంతకుముందు రూ. 2 కోట్ల రూపాయల ఖర్చుతో నూతనంగా నిర్మించిన బంజారా భవనాన్ని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవా సాధు ఆంగోత్ భగవాన్ నాయక్ ఆధ్వర్యంలో భోగ్ బండార్ ఏర్పాటు చేసి సంత్ సేవాలాల్ మహారాజ్ కు ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో గిరిజన తండాల అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తెలిపారు. గత ఎన్నికలకు ముందు తాను చేపట్టిన గిరిజన చైతన్య యాత్రకు గిరిజనులు ఆత్మీయ





ఆధార అభిమానాలు చూపారని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం తాము కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కర్నాటి లింగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కాకునూరి నారాయణ గౌడ్,రవి నాయక్, కోశాధికారి సక్రు నాయక్,కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాండు నాయక్,బిక్ష నాయక్,రాజా ప్రసాద్,రవి నాయక్,కౌన్సిలర్లు ప్రసాద్ నాయక్,చేరుపల్లి ముత్యాలు,బంజారా సేవా సంఘం అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా జగిని టెక్స్ టైల్స్ 69 వ వార్షికోత్సవ జిల్లా ప్రజలకు జగిని టెక్స్ టైల్స్ శుభాకాంక్షలు

## ప్రతీ వేసవిలో చలివేంద్రాలు, మట్టి గణపతి విగ్రహాల పంపిణి

**నల్గొండ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి)**

కస్టమర్స్ కు స్నేహితులకుజిల్లా ప్రజలకు జగిని టెక్స్ టైల్స్ 69 వ




వార్షికోత్సవ శుభాకాంక్షలు ఏఎస్పి రమేష్, డిఎస్పి శివరామిరెడ్డి , సి ఐ రాజశేఖర్ రెడ్డి, జిగిని టెక్ష్టైల్స్ యజమాని వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా జగిని టెక్ష్టైల్స్ సంస్థ యజమాని జగిని వెంకన్న మాట్లాడుతూ.. మా సంస్థ 1957 న స్థాపించామని ఇప్పటికి 69 సంవత్సరాలు గడిచినవి అని మా సంస్థ ద్వారా ప్రతీ వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు,మట్టి గణపతి విగ్రహాల పంపిణి మరియు మా సంస్థ ద్వారా మరెన్నో సామాజిక సేవలు అందించము అని అన్నారు. ఈ రోజు వార్షికోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్




చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. డిప్యూటీ మేయర్ అమీర్,మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,గుమ్ముల మోహన్ రెడ్డి, కార్పొరేటర్ హాజి,ఆర్ డి ఓ అశోక్ రెడ్డి,ఇ ఇ వెంకటేశ్వర్లు, ఏ ఎస్పిరమేష్, డి ఎస్పిశివరాం రెడ్డి,సి ఐ ఆదిరెడ్డి,సి ఐ రాజశేఖర్ రెడ్డి,ఎస్సై సైదా, బెటాలియన్ కమండెట్ వీరయ్య,డి ఎస్పి వెంకన్న,
డాక్టర్స్ పుల్లారావు,మూర్తి తదితరులు పాల్గొన్నారు.



# మూడో వార్డ్ ను అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దుతాం

**-3వార్డ్ కౌన్సిలర్ సులువ నాగలక్ష్మి చంద్ర శేఖర్**

**-25వార్డ్ కౌన్సిలర్, 3వార్డ్ కోఆర్డినేటర్ కోతి సంపత్ రెడ్డి**

**హుజూర్ నగర్, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):**



మున్సిపల్ పరిధిలోని మూడో వార్డును అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దుతామని 3వార్డ్ కౌన్సిలర్ సులువ నాగలక్ష్మిచంద్ర శేఖర్, 25వార్డ్ కౌన్సిలర్, 3వార్డ్ కోఆర్డినేటర్ కోతి సంపత్ రెడ్డి లు అన్నారు. సోమవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడో వార్డ్ ఎన్జీవోస్ కాలనీ, గణేష్ నగర్ లకు సంబంధించిన వీధిలైట్లను మున్సిపల్ సిబ్బందితో రిపేర్ చేపించాము. మున్సిపల్ సిబ్బంది ఎన్నికల విధులలో ఉండడం వలన వీధిలైట్ల విషయంలో కొంత జాప్యత జరిగింది. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో ఎన్జీవోస్ కాలనీ, గణేష్ నగర్, చైతన్య కాలనీకి సంబంధించిన పూర్తిస్థాయి మూడవ వార్డు లైట్లు అన్నిటిని రిపేరు చేయిస్తామని, డ్రైనేజీ, నూతన సిసి రోడ్ల ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల సంఖ్య మరింత పెంచుతామన్నారు. మూడో వార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డ్ కౌన్సిలర్ నాగలక్ష్మి చంద్రశేఖర్, 25వ వార్డ్ కౌన్సిలర్, మూడో వార్డ్ కోఆర్డినేటర్ కోతిసంపత్ రెడ్డి, 11వ వార్డ్ కౌన్సిలర్ పులిచింతల వెంకట్ రెడ్డి, సులువ భవాని, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**హుజూర్ నగర్ ఫిబ్రవరి 23 ( ప్రజా జ్యోతి)**

ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేసి, త్వరలో ప్రారంభించుటకు అందుబాటులో తీసుకురావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం హుజూర్నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్ల బ్లాక్ లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఇంత భారీ ఎత్తున, ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతతో నిర్మించాలని అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా అన్ని మౌలిక సదుపాయాలు పూర్తి చేసి ప్రారంభించుటకు సిద్ధం చేయాలని కలెక్టర్ అన్నారు.కార్యక్రమంలో హుజూర్నగర్ ఆర్డిఓ శ్రీనివాసులు, హౌసింగ్ పిడి సిద్ధార్థ, పిడి హార్టికల్చర్ సెరికల్చర్ నాగయ్య తాసిల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ హైకోర్టు తీర్పుపై ఉద్యమకారుల హర్షం

**నాగార్జునసాగర్, ఫిబ్రవరి 23 ప్రజా జ్యోతి**



తెలంగాణ ఉద్యమకారులకు హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు పట్ల నాగార్జునసాగర్,నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు సోమవారం నందికొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమ కారులు హీరేకర్ రమేష్ జి మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారు ల ఆకాంక్షలు 12 ఏళ్ల తర్వాత నెరవేరబోతు న్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ దాఖలు చేసిన పిటిషన్ను విచారించిన హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి అలాగే నెలకు 25 వేల రూపాయల పెన్షన్ అందించాలని ఆదేశాలు జారి చేసింది,శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ 8 వారాల గడువులోగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందని తెలిపారు, ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోవడంతోనే జేఏసీ న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందనరు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను గౌరవించి,కాలయాపన చేయకుండా వెంటనే ఉద్యమకారులకు న్యాయం చేయాలఅని రమేష్ జి అన్నారు, కోర్టు తీర్పుతో 12 ఏళ్ల ఉద్యమకారుల కల సాకారం కాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సిరికొండ మధు,పందిళ్ళ సత్యనారాయణ, మంగళగిరి వెంకోజి,పాకా శివ నాగులు, సభావత్ చంద్రమౌళి నాయక్,బోడ విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఆయేషా మీరా హత్య కేసు ముగింపు

**మండలిలో ఫోటోలతో శ్రీవారికి అపచారం**

**లడడూలో వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పింది**

**లడ్డూ గురించి మాట్లాడితే హెరిటేజ్ను ముందుకు తెచ్చారు**

**తప్పు చేసిన ఎవ్వరినీ వదలబోనన్న సిఎం చంద్రబాబు**

**పల్నాడు,**

చెప్పులు వేసుకుని వేంకటేశ్వరస్వామి ఫొటోలను మండలిలో వైకాపా సభ్యులు విసిరేశారని సిఎం చంద్రబాబు మండిపడ్డారు. శ్రీవారి విషయం బయట మాట్లాడకూడదని రెండు రోజులుగా ఆగానన్నారు. వేంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని.. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. ఏపీ శాసనమండలిలో వేంకటేశ్వర స్వామి ఫొటోలతో వైసీపీ సభ్యులు చేసిన నిరసనలపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ అంశంపై వినుకొండ సభలో సీఎం మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేశారని చెబితే హెరిటేజ్ను తెరపైకి తీసుకొచ్చారన్నారు. 'నేను ప్రాణం పోయినా తప్పు చేయను' అని స్పష్టం చేశారు. లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందన్నారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్గి ÷ర్ అయ్యారు. తప్పును పక్క వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారన్నారు. అలాంటి కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయం చేయాలా అని విమర్శించారు. తాను కూడా జైలుకు వెళ్తానని ఊహించలేదని.. నోటీసు ఇస్తే సమాధానం చెప్పేవాడినని సీఎం చంద్రబాబు అన్నారు. 'నా ప్రాణం పోయినా పరవాలేదు... రాష్ట్రం కోసం పోరాడతాను' అని చెప్పుకొచ్చారు. చాలా మంది తాను జైల్లో నుంచి ప్రాణాలతో బయటకురారని అనుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మట్లాడుతున్నారని.. రెచ్చగొట్టే పనులు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. డ్రగ్స్ మత్తులో ఆడబిడ్డల జోలికొస్తే వారికదే చివరిరోజు అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వివేకా హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని.. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవేదన కలిగించిందన్నారు. కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని తెలిపారు. దేశానికి మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

# ప్రతి కుక్కకూ ఓ రోజు వస్తుంది

**ఎన్ని కేసులు పెట్టినా, చావనైనా చస్తాను**

**ఎట్టిపరిస్థితుల్లో నేను తగ్గనే తగ్గను**

**వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు**

**అమరావతి,**

వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రతి కుక్కకూ ఒక రోజొస్తుంది. ఈ రాంబాబు అనే కుక్కకు కూడా ఓ రోజు వస్తుంది. అప్పుడు తగ్గనే తగ్గను' అని ఆయన ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆయన, బెయిల్పై విడుదలైన విషయం తెలిసిందే. అనంతరం నిన్న గుంటూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశానికి ముందు, ఆయన తాడేపల్లిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. తనపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయించారని జగన్కు వివరించారు. దీనిపై స్పందించిన జగన్, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయపోరాటం చేద్దామని భరోసా ఇచ్చారు. మీడియాతో మాట్లాడుతూ, తాను ఆవేశంలో అన్న మాటలపై రియలైజ్ అయ్యానని తెలిపారు.